
కాజ్ వే కష్టాలకు మోక్షమెప్పుడో ?

- ప్రమాదకరంగా వెదుళ్లగెడ్డ బ్రిడ్జి
- తుపానుల సమయంలో నిలిచిపోతున్న రాకపోకలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


వెద్దుళ్లగెడ్డపై ఉప్పరిగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే

కోటనందూరు: కాకినాడ-అనకాపల్లి జిల్లాలను కలిపే వెదుళ్లగెడ్డపై ఉన్న కాజ్‌వే(బ్రిడ్జి) ప్రమాదకరంగా మారింది. బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన ఈ బ్రిడ్జిపై తుపానుల సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి దుస్థితి తెలియని ప్రయాణికులు ఎంతోమంది గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. ఈ కాజ్‌వే ఇరుజిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో దీని అభివృద్ధిని ఇరుజిల్లాల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాజ్ వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వరదలు వస్తే అంతే సంగతులు

తుని-నర్సీపట్నం రోడ్డులో మండలంలోని కాకరాపల్లి శివారు ఉప్పరిగూడెం వద్ద వెదుళ్లగెడ్డపై కాజ్‌వే నిర్మించారు. కాలక్రమంలో రోడ్డు ఎత్తు పెరిగిపోవడంతో కాజ్‌వే మరింత కిందకైపోవడం , ఇరువైపులా రైలింగ్ లేకపోవడం, కింద ఫిల్లర్ల మధ్య ఖాళీ తక్కువైపోవడం, భారీగా పూడిక పేరుకుపోవడంతో వరదల సమయంలో నీరు భారీగా కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తోంది. కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తున్నప్పుడు నిరీక్షణను సహించలేని అనేకమంది ప్రయాణికులు కాజ్‌వేను దాటే క్రమంలో గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తుపానుల సమయంలో బ్రిడ్జికి ఇరువైపులా రోజుల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయిన పరిస్థితులూ ఉన్నాయి.

బ్రిడ్జి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



ఓ మోస్తరు వర్షం కురిసినా వెదుళ్లగెడ్డ పొంగి తుని-నర్సీపట్నం రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాంటి సమయంలో గెడ్డకు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. అనేకమంది ఇక్కడ గెడ్డలో కొట్టుకుపోయి చనిపోయారు. జిల్లా సరిహద్దులో ఉండడంతో ఈ బ్రిడ్జి అభివృద్ధిపై ఇరుజిల్లాల అధికారులు దృష్టి సారించడం లేదు. అనేక మంది ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నా, గెడ్డలో కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇరు జిల్లాల పాలకులు, అధికారులు గెడ్డ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– ఆరుగుల మోషే,
మాదిగ రక్షణ పోరాట సమితి అధ్యక్షులు,
కోటనందూరు

సత్యదేవుని దర్శించిన శ్రీవిద్యాపీఠం స్వామీజీ


రత్నగిరిపై స్వామీజీ, ఆయన శిష్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

అన్నవరం: విజయవాడ సమీపంలోని పెదపల్లంక ఉన్న విజయరాజేశ్వరి శ్రీవిద్యాపీఠం స్వామీజీ వాసుదేవానందగిరి తన శిష్యులతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేసి స్వామివారి ప్రసాదాలు బహూకరించారు. కార్యక్రమంలో వాసుదేవానందగిరి స్వామీజీ శిష్యులు విజయ భూమానందగిరి స్వామిజీ, శివప్రియానందగిరి స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ వసతి గృహాల్లో తనిఖీలు


విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ

ఏలేశ్వరం: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ప్రత్తిపాడు కోర్టు ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్‌జడ్జి బుల్లెమ్మ సూచించారు. పట్టణంలోని బాలికల, బాలుర వసతి గృహాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సివిల్‌జడ్జి బుల్లెమ్మ మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. నిబంధనల ప్రకారం వసతి గృహాలు నిర్వహణ ఉండాలన్నారు. అనంతరం బియ్యం, రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించారు. విద్యాబోధన, వసతిపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ, మధు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

5 వేల ఇంకుడు గుంతల మంజూరు

తుని రూరల్: నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెంపు, మురుగునీటి సమస్య పరిష్కారానికి ఐదు వేల ఇంకుడు గుంతలు మంజూరైనట్టు ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. తుని మండలంలో రెండు వేలు, తొండంగి మండలంలో రెండు వేలు, కోటనందూరు మండలంలో వెయ్యి చొప్పున ఇంకుడు గుంతలు తవ్వనున్నట్టు చెప్పారు. ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.6 వేల చొప్పున ఎన్ఆర్ఈజీఎస్ నుంచి చెల్లించనున్నట్టు ఆమె తెలిపారు. ఐదు వేల ఇంకుడు గుంతలకు రూ.3 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ఇతర పరికరాలు, పునఃనిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చెన్నారావు



జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ చెన్నారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన చంద్రనాయుడు ఉద్యోగ విరమణ పొందడంతో బాలరాజు నాలుగు నెలలు పాటు ప్రిన్సిపాల్‌గా కొనసాగారు. ఆయన స్థానంలో పదోన్నతి పొందిన చెన్నారావు బాధ్యతలు తీసుకున్నారు. చెన్నారావు గతంలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల, అన్నవరంలోని సత్యవతీదేవి మహిళా డిగ్రీ కళాశాల, ఏలేశ్వరం ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేశారు. రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన చెన్నారావుకు కళాశాల అధ్యాపక సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అన్నసమారాధన

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని దుర్గాదేవి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదానం చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నదానానికి బియ్యం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ధర్మవరంలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. విజయ దశమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని రామారావుపేట వినాయకుడి గుడి వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉపాధి గ్రామ సభ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శుక్రవారం ఉపాధి గ్రామ సభ నిర్వహించారు. సభ ఆలస్యంగా ప్రారంభం కావడంతో అక్కడికి వచ్చిన గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో 2025-26 ఆర్థిక సంవత్సరం చేపట్టే ఉపాధి పనులను గుర్తించారు.

మహిళ అదృశ్యంపై కేసు


సుబ్బలక్ష్మి

కోటనందూరు: మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన దాసం సుబ్బలక్ష్మి మండలంలోని ఇండుగపల్లి గ్రామంలో తన తమ్ముడి ఇంటికి వచ్చింది. తిరుగుప్రయాణంలో భాగంగా శుక్రవారం ఇండుగపల్లిలో ఆటో ఎక్కి తుని వెళ్లింది. అప్పటి నుంచి సుబ్బలక్ష్మి ఆచూకీ కనిపించ లేదు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బలక్ష్మి ఆచూకీ తెలిసిన వారు 94409 00773 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.

పెద్దాపురం డివిజన్‌లో కౌన్సెలింగ్ సెంటర్

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు


ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ప్రత్తిపాడు: భార్యాభర్తల మధ్య తగాదాలను పరిష్కరించేందుకు పెద్దాపురం డివిజన్‌లో డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రమాదాలు తగ్గాయన్నారు. జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించనున్నందున మరింతగా ప్రమాదాలను నివారించేందుకు సీఐ, ఎస్సైలతో హైవేపై పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. యువత ఒడిశా సరిహద్దుకు వెళ్లి గంజాయిని మన రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాలు, వినియోగించే వారిపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. కళాశాల, పాఠశాలల వద్ద జరుగుతున్న ఈవ్‌టీజింగ్‌ను అరికట్టేందుకు పోలీస్, మహిళా పోలీసులతో జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడమే కాక ఫోక్సో కేసులపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఉత్తరకంచి స్టేట్ బ్యాంకు దోపిడీ కేసును ఛేదించామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐ బి.సూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం దర్శించుకున్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలసిన మురళీరాజు


తాడేపల్లిలో రాజ్యసభ సభ్యుడు సుబ్బారెడ్డిని కలసిన మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ప్రత్తిపాడు మండలానికి చెందని ఆ పార్టీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సుబ్బారెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి నియోజకవర్గంలో రాజకీయాలపై చర్చించారు.

డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

జగ్గంపేట: స్థానిక కాపు కల్యాణ మండపంలో శుక్రవారం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ప్రారంభమైంది. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. అభ్యర్థులు ఈ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తోటరవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష


దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమకారుడు పాతంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నాల్గో రోజు శుక్రవారం కొనసాగింది. దీక్ష చేపట్టిన నేతలు రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. దీక్షా శిబిరాన్ని తూర్పుగోదావరి జిల్లా అడిషన్ ఎస్పీ సుబ్బరాజు సందర్శించి దీక్ష చేస్తున్న వారితో, గ్రామస్తులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను, గ్రామస్తులు పడుతున్న సమస్యలను స్వయంగా పరిశీలించాలని స్థానికులు కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారం వరకు శాంతియుతంగా నిరసన కొనసాగించడానికి అధికారులు సహకరించాలని కోరారు.

భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా నాగేంద్ర చౌదరి

జగ్గంపేట: భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన పాలచర్ల నాగేంద్ర చౌదరి నియమితులయ్యారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం భారతీయ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామీజీలు, పీఠాధిపతుల చేతుల మీదగా నాగేంద్ర చౌదరి నియామక పత్రాలను అందుకున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయలు, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని చౌదరి తెలిపారు.

పశుగణనకు సహకరించాలి

జగ్గంపేట/గండేపల్లి: గ్రామాల్లోని పాడి రైతులు తమ పశువుల వివరాలను అందించి అఖిల భారత పశుగణనకు సహకరించాలని జగ్గంపేట పశుసంవర్ధకశాఖ ఏడీ తాతయ్య కోరారు. ఈ నెల 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకూ పశుగణన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పశువులకు సంబంధించిన సమగ్ర సమాచారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉంటేనే ప్రభుత్వాలు రైతులకు మేలు చేసే పథకాలను రూపొందిస్తాయన్నారు. అనంతరం జగ్గంపేటలోని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్యాంపు ఆఫీసులో పశుగణన పోస్టర్‌ను ఏడీ తాతయ్య, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆవిష్కరించారు. తెలుగు యువత అధ్యక్షులు అనుకూల శ్రీకాంత్, గండేపల్లి, మురారి, నాయకంపల్లి, కాట్రావులపల్లి పశువైద్యాధికారులు సుప్రియ, ప్రగడ శ్రీనివాస్, మండపాక శ్యాంప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

తుని: స్థానిక రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయమని ఆ క్లబ్ 3020 గవర్నర్ డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. స్థానిక రోటరీక్లబ్‌లో రంగం యువజనోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు సేవ చేయడం రోటరీక్లబ్ ద్వారానే సాధ్యమన్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మంగరాజు, కార్యదర్శి వీర్రాజు, ట్రెజరర్ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గండేపల్లి: దీపావళికి బాణసంచా విక్రయల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పని స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని జెడ్ రాగంపేట ఆదిత్య హాస్పటల్ సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై యువి శివనాగబాబు, ఎస్ఎఫ్ఓ ఎస్ లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీహెచ్ మల్లికార్జునరావు

తుని రూరల్: అయిల్‌పామ్ సాగు, జీడిమామిడి తోటల బీమా ప్రీమియం చెల్లింపుల లక్ష్యాలను వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఎంపీఈఓలు సాధించాలని కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం తుని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి అధ్యక్షతన తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో పని చేస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఎంపీఈఓలకు రైతు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీహెచ్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యం, అదనపు ఆదాయానికి అయిల్ పామ్‌లో కోకో, ఇతర అంతర పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. జీడి మామిడి రైతులు నవంబరు 15లోగా వాతావరణ ఆధారిత పంట బీమా ఎకరానికి రూ.1500 చొప్పున చెల్లించాలన్నారు. ఇందుకు గాను అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పంట రుణాలు తీసుకునే సమయంలో బీమా మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయని, రైతులు అంగీకరించకపోతే ఆ మొత్తం మళ్లీ వెనుక్కి ఇస్తారన్నారు. కార్యక్రమంలో శంఖవరం ఉద్యాన అధికారి అరుణ్ కుమార్, ఐదు మండలాల వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లకు జరిమానా

తుని రూరల్: మండలంలో పోలవరం కాలువ మట్టి, రెవెన్యూ భూముల్లో గ్రావెల్ అక్రమ తరలింపుపై విజిలెన్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరి వద్ద కాపు కాసి గ్రావెల్, మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల వద్ద సీనరేజ్ రసీదులు తనిఖీ చేశారు. మూడు ట్రాక్టర్లను తనిఖీ చేయగా ఒక్క సీనరేజ్ చెల్లింపు రసీదు లేదని తనిఖీ సిబ్బంది బి.అప్పారావు తెలిపారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.316 చొప్పున సీనరేజ్ చెల్లించాల్సి ఉందని, ఆ మొత్తాన్ని జరిమానా విధించి ట్రాక్టర్ల యజమానుల నుంచి వసూలు చేస్తామన్నారు. సీనరేజ్ వసూలు చేసే హక్కును మైనింగ్ శాఖ నుంచి సుధాకర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కలిగి ఉందన్నారు. దాంతో తనిఖీలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


తాళ్లూరు రీ సర్వే గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న రైతులు

కిర్లంపూడి: భూముల రీ సర్వేతో గ్రామాల్లో భూ సరిహద్దు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జె.చిరంజీవి అన్నారు. మండలంలోని జగపతినగరం పంచాయతీ కిర్లంపూడిలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అధ్యక్షతన భూముల రీ సర్వేపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేకు సంబంధించి భూ సమస్యలపై 10 వినతులు వచ్చాయి. తహసీల్దార్ చిరంజీవి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, గుడాల రాంబాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్‌ఓ షేక్ బషీర్, వీఆర్వో ఎం.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన రైతులు

గండేపల్లి: రీ సర్వే గ్రామ సభ పేరుతో భూ సమస్యలు పరిష్కరిస్తామని తమ గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులపై రైతులు ధ్వజమెత్తారు. మండలంలోని తాళ్లూరు సచివాలయం-1లో శుక్రవారం జరిగిన రీ సర్వే గ్రామ సభలో ఈ సంఘటన చోటు చేసుకుంది. సర్వే నంబర్లు మార్పు, ఖాతా నంబర్లు సరిగా లేకపోవడం, పట్టాదారుని పేరు మార్పు తదితర సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని ఆగ్రహానికి లోనయ్యారు. తహసీల్దార్ ఆర్.శ్రీనువాసు, సర్వేయరు వి.వంశీకృష్ణ వచ్చినప్పటికీ తమకు న్యాయం జరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ప్రశ్నల వర్షం కురిపించడంతో అధికారులు సభ నుంచి వైదొలిగారు.

రీ సర్వే గ్రామ సభకు 38 అర్జీలు

మండలంలోని తాళ్లూరులో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు 38 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఎల్‌పీఎం, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేరు మార్పు, భూమి విస్తీర్ణం, తదితర వాటిపై అర్జీలు వచ్చాయని వివరించారు.

సంక్షిప్తంగా..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నలుగురికి జరిమానా, ఆరుగురికి జైలు శిక్ష పడినట్లు స్థానిక సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. పెద్దాపురం కోర్టులో శుక్రవారం నిందితులను హాజరు పరిచామన్నారు. వీరిలో నలుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా, మరో ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్షను న్యాయమూర్తి విధించారని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం నిధులు పెంచాలి

తుని: పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పథకం అమలు తీరుపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన నిధులతో భోజనంలో నాణ్యత లోపిస్తుందన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం నిధులు పెంచాలన్నారు.

పక్కదారి పడుతున్న మధ్యాహ్న భోజన పథకం సరకులు

గండేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సరకులు పక్కదారి పడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని తాళ్లూరు హైస్కూల్‌లో వంట చేసే వర్కర్లు సరకులను పక్కదారికి మళ్లిస్తుండగా హెచ్‌ఎం కంటపడటంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. విద్యార్థుల భోజనాలు పూర్తయ్యాక వంటచేస్తున్న ముగ్గురు వర్కర్లు పాఠశాల ప్రహరీ నుంచి అవతల వైపు సైకిల్‌పై ఉన్న వ్యక్తికి సుమారు ఏడు కుంచాల బియ్యం, 30 గుడ్లును చేరవేస్తుండగా హెచ్‌ఎం కేవీవీ సత్యనారాయణకు పట్టుకున్నారు. ఇలా అన్ని పాఠశాలల్లో సరకులు దారి మళ్లుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా ఈ విషయం వాస్తవమేనని, మరోసారి ఇలా జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

జగ్గంపేట: దేశంలో మత రాజకీయాలు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరశిస్తూ సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించే ప్రజా హక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గోవిందపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా సనాతన ధర్మం, తిరుమల లడ్డూ వ్యవహారం వంటి గందరగోళ పరిస్థితులు సృష్టించడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జక్కంపూడి రాజు, నాగులాపల్లి అచ్చారావు, మంగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...రంగంపేట గ్రామానికి చెందిన దివిలి చంద్రమౌళి (42) మోటార్ సైకిల్‌పై ఈ నెల 17న పెద్దాపురం వెళ్లి తిరిగి వస్తుండగా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి ఎదురుగా వచ్చేసరికి వెనకే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రమౌళిని బంధువులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జగ్గంపేట: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అమరవీరుల వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని ఎస్సై రఘునాథరావు తెలిపారు.

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రత్తిపాడు రూరల్: పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వెంకటనగరం పంచాయితీ కార్యాలయం వద్ద లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రైతు కూలీ సంఘం నాయకుడు బండి సూరిబాబు, ముప్పిడి అప్పలకొండ, బండి రత్నం పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలి

తుని రూరల్: రైతులకు యాజమాన్య పద్ధతులపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ, ఉద్యాన, క్షేత్ర స్థాయి సిబ్బందిదేనని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మాధవీ అన్నారు. తుని వెలుగు కార్యాలయంలో శుక్రవారం కాకినాడ వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ హరి అధ్యక్షతన సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల వీఏఏ, ఏహెచ్ఏ, ఏఈఓలకు సమగ్ర యాజమాన్యంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి ఏఓలు బి.అశోక్‌బాబు, నరసింహం, చంద్రశేఖర్, గాంధీ, ఈశ్వర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గండేపల్లి: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, యాంటీ రాగింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు వీడియో కాల్, వాట్సాప్ కాల్ ద్వారా డిజిటల్ అరెస్టులు అంటూ బెదిరింపులకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లోనూ లొంగవద్దని సూచించారు.

పంచాయతీ కార్యదర్శి వీర్రాజుకు సత్కారం

కిర్లంపూడి: మండలంలో వేలంక పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఏలేశ్వరం మండలం రమణయ్యపేటకు బదిలీపై వెళ్లిన రామిశెట్టి వీర్రాజు సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ నేత దోమాల గంగాధర్ అన్నారు. వేలంక సచివాలయంలో శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యదర్శి వీర్రాజును శాలువా, పూలమాలతో సత్కరించారు. గ్రామానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

పశువులు తరలిస్తున్న వ్యాన్‌పై కేసు

గండేపల్లి: పశువులు అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌పై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివ నాగబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే...విజయనగరం నుంచి హనుమాన్ జంక్షన్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నామన్నారు. వ్యాన్‌లో ఉన్న 45 పశువులను గోసాలకు తరలించినట్టు చెప్పారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని మెట్టుచింత గిరిజన తండాలో సారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు.

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో సారా బట్టీలపై దాడి చేసి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి వారి నుంచి 150 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.